క్లుప్తంగా

పోలీసులకు సత్కారం



పోలీసు అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: పోలీసుశాఖలో ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులను ఎస్పీ రోహిత్‌రాజు ఘనంగా సన్మానించారు. బుధవారం కొత్తగూడెంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రసాద్, భద్రాచలంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రంగారావు మార్చి 31న ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు వారిని శాలువతో సన్మానించారు. మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ పోలీసుశాఖలో ప్రజలకు సేవలందించడం అభినందించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వేల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సైలు నరేష్, మదార్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌కు చెందిన వరద రాంచందర్ బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సుభాష్‌నగర్, బాలాజీనగర్‌కు చెందిన ముస్లింలు ఉపవాస దీక్ష విడిచిన అనంతరం అల్పాహారం తీసుకొని నమాజ్ చేశారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ఒకరి పండుగను మరొకరు గౌరవించి ఇలాంటి విందు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోరం సురేందర్, జానీ, మౌలానా, చిట్టిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, ఆముదాల ప్రసాద్, మున్నాభాయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా శ్రీకాంత్‌రెడ్డి



ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్లను బుధవారం నియమించింది. ఈ మేరకు ఇల్లెందు కోఆర్డినేటర్‌గా రెడ్యాల సర్పంచ్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. ఈయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక సీమంతం



సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇల్లెందు: పట్టణంలోని వెంగళరావునగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ టీచర్ శారద ఆధ్వర్యంలో స్థానిక గర్భిణులను చేరదీసి వేడుక నిర్వహించారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రవేశపెట్టిన కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఏసీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్లు కవిత, అన్నపూర్ణ, ఆయా రజిత పాల్గొన్నారు.

అద్దె ఇంటికి 'అంగన్‌వాడీ'



మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సుజాతనగర్: సుజాతనగర్ మండలంలోని గొల్లగూడెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను అద్దె ఇంట్లోకి తరలించి వసతి కల్పించారు. గొల్లగూడెం అంగన్‌వాడీ కేంద్రానికి అద్దె గది దొరకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణను చెట్టు కిందనే నిర్వహించాల్సి వస్తోంది. ఈ మేరకు చెట్టు కిందనే అంగన్‌వాడీ సేవలు అనే కథనం బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితం అయింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. సీడీపీఓ సలోమి ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించి ఈ మేరకు స్థానికుడు గదికి అద్దెకు ఇవ్వడానికి అంగీకరించడంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆ గదిలో నిర్వహించాల్సిందిగా అంగన్‌వాడీ టీచరు పద్మ సూచించారు.

శిథిల బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

- ఇబ్బంది పడుతున్న రెండు గ్రామాల ప్రజలు
- మరమ్మతులతో సరిపెడుతున్న అధికారులు
- కొత్త వారధి నిర్మించాలని స్థానికుల డిమాండ్



పునుకుల, పుల్లాయిగూడెం గ్రామాల మధ్య శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

పాల్వంచరూరల్: శిథిలావస్థకు చేరిన బ్రిడ్జికి మోక్షం లభించక రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మండల పరిధి కేటీపీఎస్ ప్రభావిత ప్రాంతమైన పుల్లాయిగూడెం, పునుకుల గ్రామాల మధ్య గల బూడిద వాగుపైనున్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. నూతన బ్రిడ్జి నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు అనేకసార్లు కేటీపీఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

రోడ్డు నిర్మించారు.. బ్రిడ్జిని వదిలేశారు..

కేటీపీఎస్ జెన్‌కో యాజమాన్యం సీఎస్ఆర్ పాలసీ కింద 2022లో పునుకుల గ్రామం నుంచి పుల్లాయిగూడెం వరకు తారు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.45లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మించి, బ్రిడ్జి నిర్మాణం చేయకుండా వదిలేశారు. నిత్యం రహదారిపై కేటీపీఎస్ బూడిద వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాల రాకపోకలతో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి ప్రమాదవశాత్తు కూలితే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పుల్లాయిగూడెం ప్రజలు నిత్యం పునుకుల మీదుగా ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో వరద నీరు బ్రిడ్జి మీదుగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో పుల్లాయిగూడెం ప్రజలు చుట్టూ తిరిగి కోడిపుంజుల వాగు మీదుగా రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నారు.

కేటీపీఎస్ అధికారులు స్పందించాలి...

కేటీపీఎస్ యాష్ పాండ్ సమీపంలో ఉన్న పునుకుల, పుల్లాయిగూడెం గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉన్న రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి కేటీపీఎస్ జెన్‌కో యాజమాన్యం స్పందించి సీఎస్ఆర్ పాలసీ కింద ఈ ఏడాది నిధులు మంజూరు చేసి నూతన బ్రిడ్జి నిర్మాణం చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న బ్రిడ్జి కింది భాగం

ప్రజాప్రతినిధులు స్పందించాలి...



పునుకుల, పుల్లాయిగూడెం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ఎప్పుడు పడిపోతుందో అర్థం కాని పరిస్థితి. కేటీపీఎస్ యాజమాన్యం, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– వీరన్న, పుల్లాయిగూడెం

కొత్త బ్రిడ్జి నిర్మించాలి...



పునుకుల గ్రామం నుంచి పుల్లాయిగూడెం వరకు నిత్యం రాకపోకలు సాగించే రహదారిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. భయంభయంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. రోడ్డు నిర్మాణం చేశారు. కానీ బ్రిడ్జికి మరమ్మతులు చేస్తున్నారు. శాశ్వతంగా కొత్త బ్రిడ్జి నిర్మించాలి.

– అన్నపూర్ణ, పునుకుల

నిధులు మంజూరు కాలేదు



పునుకుల, పుల్లాయిగూడెం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి జెన్కో నుంచి రూ.45 లక్షలు సీఎస్ఆర్ పాలసీ కింద మంజూరయ్యాయి. బ్రిడ్జికి నిధులు మంజూరు కాలేదు. తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నాం. కొత్త బ్రిడ్జికి నిధులు మంజూరైతే నిర్మాణం చేపడుతాం.

– అనిల్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ

9 నుంచి ఉగాది ఉత్సవాలు



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ: ఈనెల 9, 10, 11వ తేదీల్లో స్థానిక వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో నిర్వహించనున్న ఉగాది ఉత్సవాలను జయప్రదం చేయాలని పాల్వంచ కళా పరిషత్ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహ్వాన పత్రికలను కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బిక్కసాని సుధాకర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం రాజుగౌడ్ మాట్లాడుతూ... 20 సంవత్సరాలుగా ఉగాది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడురోజుల పాటు జానపద, భరతనాట్యం, హాస్యవల్లరి, మిమిక్రీ, పాటల పోటీలు, నాటికలు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి.కొండలరావు, నవలా రచయిత శీరంశెట్టి కాంతారావు, టి.లింగమూర్తి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశం ప్రగతి సాధిస్తుంది



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వినోద్‌రావు

పాల్వంచరూరల్: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం వస్తేనే దేశం ప్రగతి సాధిస్తుందని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. స్థానిక దమ్మపేట సెంటర్‌లో బుధవారం ఖమ్మం పార్లమెంట్ బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో బీజేపీ గాలి వీస్తోందని, రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయం అన్నారు. నాకు ఓటు వేస్తే మోదీకి ఓటు వేసినట్లేనన్నారు. యావత్ భారతదేశం మూడోసారి మోదీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటోందన్నారు. రాష్ట్రంలో ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వందరోజుల పాలనలో పురోగతి లేదన్నారు. కార్యక్రమంలో రంగాకిరణ్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లారపు శ్రీనివాసరావు, చింతలచెరువు శ్రీనివాసరావు, నోముల రమేష్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, పి.రవీందర్, రమేష్, పోలోజు క్రాంతిచారి తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ దందా అరికట్టాలి

కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. ఇక్కడ జరుగుతున్న రియల్ ఎస్టేట్, భూదందాలను జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అరికట్టాలని ఎస్టీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చుంచుపల్లి, భద్రాచలంలలో గిరిజనేతరులు పెద్ద ఎత్తున క్రయవిక్రయాలు చేస్తూ ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతున్నారని పేర్కొన్నారు. ఈ రియల్ వ్యాపారులకు అధికారుల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. అక్రమార్కులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఏ పవర్ బస్తీ, గంగా హుస్సేన్ బస్తీ, ఫ్యూన్ బస్తీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం విద్యుత్ ఏడీఈ హేమచంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత బ్యూటీషియన్ కోర్సు ప్రారంభం



ప్రారంభిస్తున్న వంశీ

ఇల్లెందు: ఆంబజార్‌లో ప్రీతమ్ కమ్యూనిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉచిత బ్యూటీషియన్ కోర్సు ప్రారంభించారు. బుధవారం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ముద్రగడ వంశీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెల రోజుల్లో మహిళలు ఈ రంగంలో శిక్షణ పొందవచ్చని క్లస్టర్ ఇన్‌చార్జ్ సంతోష్ తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ పొంది ఉపాధి పొందాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఇల్లెందురూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఓటును అమ్ముకోవద్దు.. నమ్ముకుందాం..



ఇల్లెందురూరల్: పోస్టర్లు ప్రదర్శిస్తున్న జైభారత్, వాకర్స్ క్లబ్ సభ్యులు

ఇల్లెందురూరల్: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.. దానిని అమ్ముకోకుండా నమ్మకమున్న మంచి నేతను ఎన్నుకుందామని బీసీ పోరాట వేదిక, సుభాష్‌నగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని అటవీశాఖ నేచర్ పార్క్‌లో బుధవారం పోస్టర్లతో విస్తతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సందర్భంగా రాజకీయ పక్షాల తాయిలాలు, ఓటర్లను మభ్యపెట్టే విధంగా హామీలను చూసి మోసపోకుండా అర్హత, ప్రజలకు మంచి చేస్తాడని నమ్మకం ఉన్న నేతకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వెలిమిశెట్టి వీరన్న, తోగురు శ్రీనివాసరావు, సురేంద్రబాబు, గోవర్ధన్, సంతోష్, నాగేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి

పాల్వంచరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమైంది. ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని నాగారం, రంగాపురం గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును నిష్పక్షపాతంగా ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా కులమతాలకు అతీతంగా వినియోగించుకోవాలని కూలీల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పారండ్ల రంగా, కార్యదర్శులు దుర్గారావు, మౌనిక, క్షేత్ర, సాంకేతిక సహాయకులు శ్రీను, వీరన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: నియోజకవర్గ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు, కుంటినాగులగూడెం, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీ, వెంగళరావు కాలనీ, బొల్లేరుగూడెం, టీచర్స్ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కూనంనేని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల ఆదరణ మరువలేనిదన్నారు. ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరు ఏర్పాటు చేస్తానన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, చెరుకూరి శేఖర్, శనిగారపు శ్రీనివాసరావు, మన్నెం వెంకన్న, ముత్యాల కిరణ్, సత్యనారాయణ, పాషా, లక్ష్మి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గండికోట వెంకటస్వామి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వడ్డెర కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించి, ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెర కులాన్ని మర్చిపోయిందన్నారు. ఈ మేరకు వడ్డెర కులస్తులు వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు కోసం రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. వడ్డెర్ల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ వడ్డెర కులాన్ని ఎస్టీలో చేర్చుతామని ప్రకటించారని, తెలంగాణ వచ్చాక కేసీఆర్‌కు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఉపయోగం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల నాగరాజు, ఆలకుంట శోభన్, జరుపటి కృష్ణ, బత్తుల నాగరాజు, రాపోలు కుమార్, కంది ఓదెలు, రాపోలు సందీప్, వల్లెపు కోటి, సూరసాయి, జరపాటి శ్రీనివాస్, తురక స్వామి, ముద్దంగుల చక్రి, పల్లపు మల్లేష్, వెంకటేశ్వర్లు, గోగుల ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి



ఎఫ్‌డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ రాజీవ్‌నగర్ తండా గుడిసెవాసులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సహకరించాలని అటవీశాఖ డివిజనల్ అధికారి వెంకన్నకు సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెవాసులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత అబ్దుల నబీ మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి పలువురు పేదలు ప్రభుత్వ ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కనీస సౌకర్యాలు కల్పించాలని పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాల వద్ద ధర్నా చేసి వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించి గుడిసెవాసులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారని గుర్తుచేశారు. దీనికోసం పనులకు ఉపక్రమించిన మిషన్ భగీరథ అధికారులను అటవీశాఖ అడ్డుకుంటోందని ఆరోపించారు. తాగునీటి సౌకర్యం కల్పన కోసం ఎఫ్‌డీఓ, ఎఫ్ఆర్ఓలను కలిసి విన్నవించామని, వారు సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. అలేటి కిరణ్, మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, వీరభద్రం, రాందాస్, వెంకన్న, హుస్సేన్, మల్లయ్య, సంతోష, కౌసల్య, రజియా, విజయ, సుజాత పాల్గొన్నారు.

కేటీపీఎస్‌కు జాతీయ స్థాయి ర్యాంక్‌పై హర్షం



సీఈని సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన 800 మెగావాట్ల కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం విద్యుత్ ఉత్పత్తిలో జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్, జెన్‌కోలో ప్రథమ స్థానం రావడం పట్ల పలు కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీఈ కార్యాలయంలో సీఈ పి.వెంకటేశ్వరరావును కలిసి అభినందించారు. సీఈ మాట్లాడుతూ సమష్టి కృషితోనే ఉత్పత్తి సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా సీఈని సన్మానించారు. కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్, తోట కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, ధర్మపురి నాగేశ్వరరావు, బొల్లి వెంకట రమణ, నారందాసు వెంకటేశ్వర్లు, పి.రాము, సముద్రాల రాంబాబు, బాలాజీ నాయక్, ధానయ్య, బాలాజీ నాయక్, బూర్గుల విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, రాయప్ప, రామచందర్, అశోక్, నక్కా చంద్రబాబు, కాల్వ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'హరితనిధి'పై తనిఖీ



ఎమ్మెల్యే కోరం కనకయ్యతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని అర్బన్ నేచర్ పార్క్, జోడుబావుల నర్సరీలలో హరితనిధి పథకంలో భాగంగా చేపట్టిన పనులను తనిఖీ బృందం ఎఫ్‌డీఓ బి.రాములు బుధవారం పరిశీలించారు. ఆయా చోట్ల మొక్కల పెంపకం, వాటి రక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని ఏఏ ప్రాంతాలలో నాటేందుకు ప్రణాళిక రూపొందించారువివరాలను రికార్డుల ఆధారంగా తనిఖీ చేశారు.

నేచర్ పార్క్‌లో ప్రత్యేక బృందం తనిఖీ చేస్తున్న సమయంలో పార్క్‌లో వాకింగ్ చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వారికి తారసపడ్డారు. నేచర్ పార్క్ తీర్చిదిద్దిన తీరును ఎమ్మెల్యే ప్రశంసించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఎఫ్ఆర్ఓ బీవీఎస్ఎన్ ప్రసాద్, డీఆర్ఓ సాల్మన్‌రాజ్, బీట్ ఆఫీసర్లు ఈరులాల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు..

ఇల్లెందు: నిన్నటి వరకు పట్టణంలోని ప్రకృతి వనాలపై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ఆవరించింది. ప్రస్తుతం నిర్లక్ష్యం వీడి వాటిపై దృష్టి సారించారు. గత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకృతి వనాల మీద ప్రత్యేక దృష్టి సారించిన విషయం విధితమే... కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ పట్టణ, పల్లె ప్రకృతి వనాల మీద ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటి వరకు ఎలాంటి సమీక్షలూ చేయలేదు. అయినా ఇల్లెందు పట్టణంలోని పట్టణ ప్రకృతి వనాల మీద పట్టింపెవరికి... అనే శీర్షికన సాక్షిలో గత నెల 29న ఓ కథనం వచ్చింది. స్పందించిన చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు బుధవారం పట్టణంలోని పార్క్‌లను సందర్శించి పరిశీలించారు. పట్టణంలోని ప్రకృతి వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కంచెలు, మరమ్మతులు చేయాలని, చెట్లు, మొక్కలకు నీటి సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు. వాకింగ్ ట్రాక్‌లను పునరుద్ధరించాలని, అక్కడక్కడ సేద తీరేందుకు గద్దెలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవికాలం ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు చెట్ల కింద ఉపశమనం కలిగే విధంగా వనాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పార్క్‌లలో వాకింగ్ ట్రాక్‌లు సిద్ధం చేయాలని, ఉదయాన్నే స్థానికులు వాకింగ్ చేసుకునేలా తగు సదుపాయం కల్పించాలని కోరారు. ఇల్లెందు పట్టణంలో 20 ఎకరాల్లో బృహత్ పట్టణ ప్రకృతి వనం, చిట్టడివి, అర్బన్ పార్క్‌లు ఉన్నాయి. కానీ గత ఏడాది కాలంగా వాటి మీద పర్యవేక్షణ గాలికి వదిలేశారు. పార్క్‌ల మీద ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించింది. ఖాళీ స్థలాలు గుర్తించింది. అయితే ఈ పార్క్‌లలో మొక్కలకు నీళ్లు లేవు, కంచెలు లేవు, పార్క్‌లలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించటం లేదు. నీళ్లు లేక మొక్కలు వాడిపోతున్నాయి. కంచెలు లేక పశువులు, మేకలు మొక్కలను తింటున్నాయి. ఇక మొక్కల మధ్య ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి నాటిన మొక్కలను ఎదుగుదలను అడ్డుకుంటున్నాయి. నీటి కోసం ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్ పైపులు పార్క్‌లో ఎక్కడిక్కడ చెల్లా చెదురుగా పడిపోయాయి. ఇలాంటి ప్రకృతి వనాలను మళ్లీ పునరుద్ధరించేందుకు తగు చర్యలు చేపడతామని చైర్మన్ చెప్పారు.



పట్టణ ప్రకృతి వన్నాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ

పట్టణ ప్రకృతి వనాలను తీర్చిదిద్దుతాం...

పట్టణంలో పట్టణ ప్రకృతి వనాలను తీర్చి దిద్దుతాం.. అర్బన్ పార్క్‌లు, చిట్టడివిల పర్యవేక్షణ పెంచి రక్షణ కల్పిస్తాం. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాము.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, చైర్మన్, ఇల్లెందు మున్సిపాలిటీ